నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, బుధవారం 17 ఏప్రిల్ 2024 | RANGAREDDY

# పకడ్బందీగా ఎన్నికలు నిర్వహిస్తాం



## కలెక్టర్ శశాంక

బండ్లగూడ, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పకడ్బందీగా ఎన్నికలు నిర్వహిస్తామని రంగారెడ్డి కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో 2877 పోలింగ్ కేంద్రాల ద్వారా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 18న నోటిఫికేషన్ విడుదల కాగానే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. నామినేషన్‌ల దాఖలు 25 వరకు కొనసాగుతుందన్నారు. 26న నామినేషన్ల పరిశీలన, 27 నుంచి 29 వరకు నామినేషన్‌ల ఉపసంహరణ ఉంటుందని పేర్కొన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 29,28,186 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేసి నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### మద్యం, నగదు నియంత్రణకు పక్కాగా చర్యలు

ఎన్నికల్లో మద్యం, నగదు పంపిణీకి తావు లేకుండా పక్కాగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. ఏడు అసెంబ్లీ నియోజవర్గాల పరిధిలో 21 టీమ్‌లు పని చేస్తున్నాయన్నారు. ఎన్నికల ప్రక్రియలో 13,443 మంది పాల్గొంటున్నట్లు వివరించారు. మూడు షిఫ్టుల్లో పార్లమెంటు పరిధిలో నిరంతర తనిఖీలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే మొదటి విడుత ఈవీఎం రాండమైజేషన్ పూర్తయిందన్నారు. ఇబ్బందులు తలెత్తకుండా అదనపు ఈవీఎంలను కూడా అందుబాటులో ఉంచామన్నారు. పోస్టల్ బ్యాలెట్ల విషయంలో గత ఎన్నికల్లో జరిగిన తప్పులకు అవకాశం ఇవ్వబోమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నెల 23 వరకు వృద్ధులు, దివ్యాంగుల నుంచి పోస్టల్ బ్యాలెట్లు సేకరిస్తామన్నారు.

### ఓటర్లలో అవగాహన కల్పిస్తున్నాం

ఉన్నత విద్యావంతులు, అధిక ఆదాయం కలిగినవారు పోలింగ్ ప్రక్రియలో సరిగ్గా పాలుపంచుకోవడం లేదని కలెక్టర్ శశాంక తెలిపారు. పోలింగ్ శాతం పెరిగేందుకు అన్ని అవగాహన చర్యలు చేపట్టినట్లు వివరించారు. రంగారెడ్డి జిల్లా పరిధిలో 25 వేల పోస్టల్ బ్యాలెట్స్ ఉన్నాయన్నారు. కౌంటింగ్ చేవెళ్లలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. చేవెళ్ల అయితే మిగతా ఏడు నియోజకవర్గాలకు మధ్యలో ఉంటుందనే భావనతో అక్కడ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజకీయపక్ష నేతల అభిప్రాయం కూడా సేకరించినట్లు వివరించారు. ఇప్పటికే రాజేంద్రనగర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకటరెడ్డి, తహసీల్దార్ రాములు, పలువురు అధికారులు పాల్గొన్నారు.





- బీసీ నినాదంతో ఏకమవుతున్న బీసీలు
- కాసానిని గెలిపించుకుంటామంటున్న బీసీ కులసంఘాలు
- అన్ని పార్టీల్లోని బీసీల్లో కాసానిని గెలిపించుకోవాలనే లక్ష్యం
- జిల్లాలో మెజార్టీ ఓట్లు బీసీలవే
- జిల్లాలో 10 లక్షల ఓట్లకుగాను 6 లక్షల ఓట్ల వరకు బీసీ ఓటర్లే
- ప్రతీ నియోజకవర్గంలో 50 వేలకుపైగా ముదిరాజ్ ఓట్లు

# బీసీలంతా బీఆర్‌ఎస్‌వైపే..

## కాసాని గెలుపు ఖాయం

వికారాబాద్, ఏప్రిల్ 16, (నమస్తే తెలంగాణ): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పార్టీ ముందుకెళ్తున్నది. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో మొన్నటి వరకు బీఆర్‌ఎస్ పోటీనే కాదు అనుకున్న కాంగ్రెస్, బీజేపీలకు షాకిస్తూ పక్కా వ్యూహంతో ముందుకెళ్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీసీ డిక్లరేషన్ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, అసెంబ్లీ ఆవరణలో జ్యోతిబా పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత జిల్లా నుంచే ఉద్యమం ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఎన్నికలకు ముందే బీసీ వాదాన్ని ఎత్తుకున్న బీఆర్‌ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా బీసీ ఉద్యమ నేతను బరిలోకి దింపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సుపరిచితులు, బీసీ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన కాసాని జ్ఞానేశ్వర్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగడంతో రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. అంతేకాకుండా బీసీలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలతో బీసీలంతా ఏకమవుతున్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ బీసీ ఉద్యమ నేత కాసానిని గెలిపించుకోవడమే లక్ష్యంగా బీసీలు ముందుండి నడుస్తున్నారు.

జిల్లాలోని అన్ని కుల సంఘాలు ఒక్కటై బీసీ వాదాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్తున్నారు. ఊరూరా అన్ని బీసీ సంఘాలు ఐక్యంగా సమావేశాలు నిర్వహించుకుంటూ రాజకీయ పార్టీలకు అతీతంగా బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కాసానిని గెలిపించుకునేందుకు సిద్ధమయ్యారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి బీసీల సత్తా ఏందో చూపిస్తామని బీసీ కుల సంఘాలు సవాల్ విసురుతున్నారు. మరోవైపు బీసీ వాదంతో జిల్లాలోని బీసీలంతా కాసానికి జై కొడుతుండడంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీల అభ్యర్థులు అయోమయంలో పడిపోయారు. ఏదేమైనా బీసీ వాదం జిల్లా అంతటా బలంగా వినిపిస్తున్న దృష్ట్యా కాసాని గెలుపు ఖాయమనే అభిప్రాయం అన్ని వర్గాల నుంచి వ్యక్తమవుతున్నది.

### జిల్లాలో మెజార్టీ ఓట్లు బీసీలే..

జిల్లాలో మెజార్టీ ఓట్లు బీసీ ఓటర్లు ఉన్నారు. ప్రతీ నియోజకవర్గంలో లక్షకుపైగా బీసీ ఓటర్లుండడం గమనార్హం. జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లు 8 లక్షల వరకు ఉండగా, వీరిలో దాదాపు 5 లక్షల వరకు బీసీ ఓటర్లే ఉన్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో 50 వేలకుపైగా ఒక్క ముదిరాజ్ ఓటు బ్యాంకు ఉండడం గమనార్హం. రాష్ట్రంలోనే పరిగి నియోజకవర్గంలో అత్యధికంగా 65-70 వేల వరకు ముదిరాజ్ ఓటర్లున్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ బీసీ ఓటర్లే అధికంగా ఉన్నారు. మెజార్టీ ఓటు బ్యాంకుగా ఉన్న బీసీల మద్దతు కూడగట్టేందుకు కాంగ్రెస్, బీజేపీలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసానిని గెలిపించుకునేందుకు బీసీలంతా ఏకమవుతుంటే, బీసీల ఐక్యతను దెబ్బతీసేందుకు కాంగ్రెస్, బీజేపీలు కుట్ర చేస్తున్నాయి. బీసీవాదం క్షేత్రస్థాయిలోకి చొచ్చుకుపోవడంతో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీల కుట్రలు సాగవని బీసీ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మెజార్టీ ఓటర్లుగా ఉన్న బీసీల్లో చీలిక తెస్తూ పబ్బం గడుపుతున్న కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెబుతామంటున్నారు. అయితే మెజార్టీ ఓట్లున్న బీసీలు బీఆర్‌ఎస్‌కు మద్దతిస్తే చాలు కాసాని భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని వినిపిస్తుంది.

### బీసీలంతా కాసానివైపే..

ఉమ్మడి జిల్లా ప్రజలకు సుపరిచితుడు, బీసీ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కాసాని జ్ఞానేశ్వర్‌వైపే జిల్లాలోని బీసీలంతా నిలుస్తున్నారు. కాసాని ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వారైనప్పటికీ అన్ని బీసీ సంఘాలను కలుపుకొని ముందుకెళ్తున్నామన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్మన్‌గా ఉన్నప్పటి నుంచి జిల్లా ప్రజలకు కాసాని దగ్గరయ్యారు. ఎవరు అడిగినా కాదనకుండా సహాయం అందించిన వ్యక్తి కావడంతో అన్ని పార్టీల్లోని బీసీలు ఐక్యమవుతున్నారు. కాసానికి ప్రత్యేకంగా పరిగి, వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల్లో ఉన్న అనుచరులు, బీసీ ముఖ్య నాయకులు బీసీ వాదాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్తున్నారు.



# పాతాళంలో నీరు.. పరేషాన్‌లో రైతు!

- రంగారెడ్డిజిల్లాలో పూర్తిగా అడుగంటుతున్న భూగర్భ జలాలు
- చేతికొచ్చిన వరి పంటకు నీరు అందక ఎండుముఖం
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు
- పశువుల మేతగా వరి పంట
- ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరుతున్న అన్నదాతలు

షాబాద్, ఏప్రిల్ 16 : భూగర్భజలాలు అడుగంటడంతో బోరు బావుల్లో నీరు ఇంకిపోతున్నది. దీంతో చేతికందే దశలో ఉన్న వరి పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు నానా తంటాలు పడుతున్నారు. అప్పులు చేసి కొత్తగా బోర్లు వేస్తున్నా, వ్యవసాయ బావుల్లో పూడికతీత పనులు చేస్తున్నా, లాభం లేకుండా పోతున్నది. కొద్ది రోజుల్లోనే చేతికొస్తుందనుకున్న దశలో నీళ్లు సరిపోక పంటలు ఎండి-పోతున్నాయి. కంటికి రెప్పలా కాపాడుకున్న పైరు కండ్ల ముందే ఎండిపోతున్నా అన్నదాతలు ఏమీ చేయలేక పోతున్నారు.

ఇందుకు సాక్ష్యం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని కుమ్మరిగూడ గ్రామంలో చేతికొచ్చిన వరి పంట ఎండిపోతున్న దృశ్యాలే.. ఎండిన పంటను చూసి రైతులు ఆవేదన చెందుతున్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇది ఒక్క షాబాద్ మండలంలోనే కాదు.. రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా అంతటా ఇదే పరిస్థితి నెలకొన్నది.

### ఎండుతున్న పంటలతో రైతుల కష్టాలు..

యాసంగి సీజన్‌లో బోరు బావుల కింద సాగు చేసిన పంటలు నీళ్లు పారకపోవడంతో ఎండిపోతున్నాయి. ప్రధానంగా రైతులు వరి పంటను అత్యధికంగా సాగు చేస్తున్నారు. గత ఐదేండ్లుగా వానకాలం, ఎండాకాలం వరి పంటను సాగు చేసుకుంటూ వస్తున్నారు. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా చెరువులకు మరమ్మతులు చేయడంతో భారీ వర్షాలకు చెరువులు నిండి అలుగు పారి బోరు బావుల్లో నీటి మట్టం గణనీయంగా పెరిగింది. దీనికి తోడు 24 గంటల విద్యుత్తు, అదునుకు పెట్టుబడి సాయం ఇవ్వడంతో అన్నదాతలకు ఇబ్బందులు లేకుండేవి. కానీ అందుకు విరుద్ధంగా గతేడాది వర్షాలు సరిగ్గా కురువకపోవడంతోపాటు భూగర్భజలాలు అడుగంటిపోయాయి. దీనికి తోడు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ఉన్న కొద్దిపాటి పంట కూడా నీళ్లు పారకపోవడంతో ఎండుముఖం పడుతున్నది.

### వరిపంటను పశువుల మేతగా వేస్తున్నా..



నేను యాసంగి సీజన్‌లో రెండు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. మార్చి వరకు బాగానే నీరు పారింది. పంట చేతికొస్తదని అనుకున్నా. చివరి దశలో బోరు నీరు పోయడంలేదు. చేతికొచ్చిన వరి పంట పూర్తిగా ఎండింది. పంట కోసం రూ.50వేల వరకు ఖర్చు చేశాను. ఎండిపోయిన వరి పంటను పాడి ఆవులకు మేపుతున్నా. ప్రభుత్వం ఆదుకోవాలి.

– పి. జైపాల్, యువ రైతు, కుమ్మరిగూడ, షాబాద్ మండలం

### రైతులకు నష్టపరిహారం అందించాలి



బోర్లలో నీరు లేకపోవడంతో పంటలన్నీ ఎండిపోతున్నాయి. రెండు ఎకరాల్లో వరి పంట వేశా. ఇంకా నెల రోజులైతే పంట చేతికొచ్చేది. నీళ్ల అందకపోవడంతో పంట మొత్తం ఎండిపోయింది. అప్పులు చేసి పంటలు సాగు చేశాను. కండ్ల ఎండిన పంటను చూస్తే కన్నీరు వస్తున్నది. ప్రభుత్వం తగిన పరిహారం ఇవ్వాలి.

– పోనమోని కృష్ణయ్య, రైతు, కుమ్మరిగూడ, షాబాద్ మండలం



### పశువుల మేతగా వరి పంట

షాబాద్ మండలంలోని కుమ్మరిగూడ గ్రామ రైతు పోనమోని కృష్ణయ్య రెండెకరాల పొలంలో వరి పంట సాగు చేశాడు. దాని కోసం రూ.50వేల వరకు ఖర్చు చేశాడు. మార్చి వరకు పంటకు నీరు బాగానే అందింది. ఇంకో నెల రోజులైతే పంట చేతికొచ్చేది. కానీ నీరు అందకపోవడంతో పంట మొత్తం ఎండిపోయింది. మరో యువ రైతు పోనమోని జైపాల్‌కు చెందిన రెండెకరాల పొలం ఎండడంతో దిక్కుతోచని స్థితిలో వరిపంటను పాడి ఆవులకు పంటను మేపుతున్నాడు.

## నెల రోజుల్లో జిల్లాలో పట్టుబడింది

# రూ.6.67కోట్లకు పైగానే!

- ఇందులో పట్టుబడిన నగదు రూ.2.61కోట్లు
- లోక్‌సభ ఎన్నికల్లో అక్రమ రవాణాను అడ్డుకుంటున్న తనిఖీ బృందాలు

రంగారెడ్డి, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేసేందుకు అధికారయంత్రాంగం అవసరమైన చర్యలు తీసుకుంటున్నది. ఇందుకు ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేశారు. నగదు అక్రమ రవాణా, మద్యం పంపిణీ ఇతర వాటికి అడ్డుకట్ట వేసేందుకు గత కొద్దిరోజులుగా తనిఖీలను ముమ్మరం చేశారు. జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లోనూ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఇప్పటివరకు రూ.2,61,31,708 నగదు పట్టుబడింది. రూ.4,18,700 విలువ జేసే 5.30కిలోల వెండి ఆభరణాలను తనిఖీ బృందాలు స్వాధీనపర్చుకున్నాయి. రూ.1,28,533 విలువ జేసే బహుమతులను, రూ.69,51,215 విలువ జేసే 12,591.63లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. రూ.3,28,99,481 విలువ జేసే 732.4524కిలోల డ్రగ్స్‌ను, రూ.2,21,000 విలువ జేసే ఇతర వాటిని పట్టుకుని సీజ్ చేసినట్లు సంబంధిత అధికారులు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

# ముప్పు తప్పించేలా ముందస్తు ప్రణాళిక

సిటీబ్యూరో, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : రానున్న వర్షాకాలంలో హైదరాబాద్ నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పూర్తిస్థాయిలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డిలతో కలిసి జీహెచ్‌ఎంసీ పరిధిలో మాన్‌సూన్ ముందస్తు ఏర్పాట్లపై ఈఎన్‌సీ, జోనల్ కమిషనర్లు, ఎస్‌ఈలు తదితరులతో దానకిశోర్ సమీక్షించారు. వర్షాకాలంలో భారీ వర్షాలు, వరదలతో నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు, నష్టం వాటిల్లకుండా ముందస్తు ప్రణాళికలతో పూర్తి పటిష్టమైన చర్యలు చేపట్టాలని దానకిశోర్ సూచించారు.

### భరోసా కల్పించేలా సహాయక చర్యలు

డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్‌ఎఫ్) అన్ని వేళలా అప్రమత్తమై సిద్ధంగా ఉండాలని, ఫైర్, వాటర్ , జీహెచ్‌ఎంసీ, పోలీస్ తదితర శాఖలన్నీ కలిసి మే నెల చివరి వారంలో కానీ, జూన్ మొదటి వారంలోగా మాక్ డ్రిల్ ఏర్పాటు చేయాలని దానకిశోర్ చెప్పారు. వరద ముంపునకు చేపట్టిన పనులు 52 శాతం పూర్తయ్యాయని, మిగిలిన అన్ని పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### 125 వాటర్ లాగిన్ లొకేషన్స్..

జీహెచ్‌ఎంసీ పరిధిలో 125 వాటర్ లాగిన్ లొకేషన్లను గుర్తించామని, 22 ప్రాంతాల్లో సమస్యలను శాశ్వతంగా పరిష్కరించినట్లు అధికారులు వివరించారు. జూన్ మొదటి వారంలోగా నాలాలన్నింటినీ శుభ్రం చేయాలన్నారు. 1304 కి.మీ పొడవు నాలాలు ఉన్నాయని, భద్రత చర్యల్లో భాగంగా నాలా ఆడిట్ చర్యలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రజలు నాలాల్లో చెత్త వేస్తున్నారని, వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ప్రజల కోసం చేపడుతున్న మాన్‌సూన్ ప్రిపేర్డ్ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లాలని దానకిశోర్ సూచించారు. క్రమం తప్పకుండా చేసిన పనులు, జరుగుతున్న పనులు ప్రజలకు తెలియజేయాలన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని దానకిశోర్ సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఈఎన్‌సీ జియావుద్దీన్, జోనల్ కమిషనర్లు రవికిరణ్, బోర్కాడే హేమంత్ సహదేవ్ రావు, స్నేహ శబరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం సమన్వయకర్తగా ముత్తిరెడ్డి యాదగిరి

## భువనగిరి పార్లమెంటు నియోజకవర్గానికి సమన్వయకర్తలను నియమించిన కేటీఆర్

రంగారెడ్డి, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ పార్టీ లోక్ సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకు వెళ్లున్నది. ఇందులో భాగంగా లోక్ సభ ఎన్నికల కోసం సమన్వయకర్తలను నియమించింది. ఇప్పటికే చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గానికి సమన్వయ కర్తలను నియమించగా..మంగళవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భువనగిరి పార్లమెంటు నియోజకవర్గానికి సమన్వయ కర్తలను నియమించారు. భువనగిరి పార్లమెంటు పరిధిలోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ సమన్వయకర్తగా మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డిని నియమించారు.

పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధులను చేయడం, పార్టీ అధినాయకత్వం ఇచ్చే మార్గదర్శకాలు, దిశా నిర్దేశాన్ని ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులకు తెలియజేసి విజయావకాశాలను మెరుగుపర్చడం లక్ష్యంగా పార్టీ నియమించిన సమన్వయ కర్తలు పనిచేయనున్నారు.